
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
గురువారం 1 ఆగస్టు 2024





గోదావరి వద్ద దేవాదుల ప్రాజెక్టు ఇన్ టేక్‌వెల్ (ఫైల్)

ఎత్తిపోతలు ఎలా?!

దేవాదుల ప్రాజెక్టును వేధిస్తున్న నిధుల కొరత

- ఈ ఏడాది ఖరీఫ్‌కు ఓరుగల్లు రైతాంగానికి దేవాదుల నీళ్లు కష్టమే..
- ఏటా 60 టీఎంసీల నీటిని 6.21లక్షల ఎకరాలకు అందేలా ప్రణాళిక
- ఇప్పటివరకు అత్యధికంగా 16.41 టీఎంసీల నీరే లిఫ్ట్
- 20 ఏళ్లలో రూ.13,911.88కోట్లు ఖర్చు చేసినా అందని గోదావరి జలాలు
- పాలెం వాగు ప్రాజెక్టు, ఎస్సారెస్పీ-2, మోడికుంట ప్రాజెక్టుల పరిస్థితీ ఇంతే..
- వానలు అంతంతే.. ప్రాజెక్టుల నీళ్లపైనే రైతుల ఆశలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

దేవాదుల ప్రాజెక్టును నిధులు కొరత వేధిస్తోంది. 20ఏళ్లగా దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తి కావటం లేదు. ఏటా 60టీఎంసీల నీటిని ఎత్తిపోసి 6.21లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన దేవాదుల ప్రాజెక్టు పనులు అసంపూర్తిగానే మిగిలిపోతున్నాయి. ఇప్పటివరకు ఏ ఏడాది కూడా కనీసం 16.41టీఎంసీలకు పైగా నీటిని ఎత్తిపోయలేదు. పైగా ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.13,911.88కోట్లు ఖర్చు చేయగా, ఇంకా రూ.3,588కోట్లు అవసరంగా ఇంజనీర్లు గుర్తించారు. అయితే మూడో దశ నుంచి నీటిని లిఫ్టు చేసేందుకు రూ.650కోట్ల చాలని ప్రభుత్వం సూచన ప్రాయంగా అంచనా వేసింది. కానీ బడ్జెట్‌లో దేవాదులకు నిధులు కేటాయించకపోవటంతో ఈ ఏడాది ఖరీఫ్‌కు కూడా గోదావరి జలాల ఎత్తిపోతలు లేనట్టేనా..? అనే ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతోంది.

60టీఎంసీలు.. 6.25లక్షల ఎకరాలకు నీళ్లు

ఉమ్మడి వరంగల్‌కు వరప్రయదాయనిగా చెప్పుకునే దేవాదుల ప్రాజెక్టు (జె.చొక్కారావు ఎత్తిపోతల పథకం)కు టీడీపీ హయాంలో అప్పటి ఏటూరునాగారం మండలం దేవాదుల, గంగారం గ్రామల వద్ద 2003 జూన్ 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాన చేశారు. ఈపీసీ పద్ధతిలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. అయితే 2005లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి, రెండో దశల పనులకు శ్రీకారం చుట్టారు. దేవాదుల ప్రాజెక్టు నుంచి ఏటా 38.182 టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో వరంగల్ మహానగరంతోపాటు ఇతర ప్రాంతాలకు 2.842టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించారు. మిగిలిన 35.34టీఎంసీలనే 4.75లక్షల ఎకరాల సాగుకు వినియోగించాలని నిర్ణయించారు. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత దేవాదులు ప్రాజెక్టును ప్రభుత్వం పునఃసమీక్షించింది. తుపాకులగూడెం వద్ద రూ.2,121కోట్ల వ్యయంతో సమ్మక్క బ్యారేజీని నిర్మించారు. ఈ బ్యారేజీలో నిల్వ ఉన్న నీటితో 60టీఎంసీలను ఎత్తిపోసేలా డిజైన్ చేశారు. ఏడాదిపాటు గోదావరి జలాలు అందుబాటులో ఉన్న సమయంలో దేవాదుల నుంచి ఎత్తి 6.21లక్షల ఎకరాలకు సాగునీరు, ఎస్సారెస్పీ ద్వారా మరో 7.50లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించే విధంగా గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే మూడు దశల్లో చేపట్టిన పైపులైన్లు, గ్రావిటీ కెనాళ్లు, రిజర్వాయర్లు, లిఫ్టుల పనులు దాదాపు పూర్తి అయినప్పటికీ పూర్తిస్థాయిలో నీటిని ఎత్తిపోయలేని స్థితి నెలకొంది. మొదటి దశ, రెండో దశ పనులు పూర్తి కాగా, మూడోదశ పనుల్లోనే జాప్యం జరిగింది.

అతిపెద్ద సొరంగాన్ని ములుగు జిల్లా జాకారం నుంచి హనుమకొండ జిల్లా దేవన్నపేట వరకు 49.6కిలోమీటర్లు నిర్మించారు. సొరంగం నుంచి గోదావరి జలాలను తరలించే పనులు పూర్తి చేశారు. దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న వెల్ టైప్‌లో నిర్మించగా, 141 మీటర్ల లోతులో పంపుహౌస్ ఏర్పాటు చేశారు.



దేవాదుల లిఫ్ట్ ద్వారా ధర్మసాగర్ చెరువులోకి పంపింగ్ అవుతున్న గోదావరి జలాలు


నీళ్లున్నా.. ఎత్తి పోసుదేట్లా..?

20 ఏళ్ల కాలంలో దేవాదుల ప్రాజెక్టు నుంచి ఆశించిన స్థాయిలో నీటి ఎత్తిపోతలు లేవు. తొలుత 2009-10లో దేవాదుల నుంచి 0.976 టీఎంసీల నీటినే లిఫ్టు చేయగా, 2010-11లో 1.053 టీఎంసీలు ఎత్తిపోశారు. 2013-14 వరకు కూడా మూడు టీఎంసీల నీటిని ఎప్పుడు ఎత్తిపోసిన సందర్భాలు లేవు. తెలంగాణ ఏర్పడిన తరువాత ప్రభుత్వం పెద్దగా నిదులు కేటాయింపులు చేయకపోవటంతో దేవాదుల ఎత్తిపోతలు నత్తనడకనే సాగాయి. 2014-15లో ఖరీఫ్, యాసంగిలో కలిపి 4.981 టీఎంసీలను లిఫ్టు చేయగా, 2015-16లో 5.6టీఎంసీలు, 2016-17లో 5.53టీఎంసీలే ఎత్తిపోశారు. ఈ పదేళ్ల కాలంలో అత్యధికంగా 2018-19లో మాత్రమే 16.4టీఎంసీలను లిఫ్టు చేయగా, 2023-24లో 14.466టీఎంసీలు, 2019-20లో 13.36టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కూడా ఏ ఏడాది కూడా 20టీఎంసీల నీటిని ఎత్తిపోయలేదు. ప్రస్తుతం మూడో దశ పనులు పూర్తి అయ్యాయి. ఈ దశ నుంచి 50టీఎంసీల నీటిని ఎత్తి పోసుకునేందుకు అవకాశం ఉంది. గోదావరిలో కూడా నీళ్ల పుష్కలంగా ఉన్నాయి. దేవాదుల నుంచి మూడో దశలో దేవన్నపేట రిజర్వాయర్‌కు నీళ్ల చేరిన తరువాత వాటిని జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘనపూర్, జనగామ, పాలకుర్తితోపాటు వర్ధన్నపేట, పరకాల, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే నిధుల కొరతతో డిస్ట్రిబ్యూటరీ పనులు, దేవాదుల నీటి కోసం తవ్విన కాలువల లైనింగ్ దెబ్బతిన్న పనులు పూర్తి కావటం లేదు. వీటితోపాటు పాలకుర్తి, నష్కల్, చెన్నూరు తదితర రిజర్వాయర్లు ఇంకా పూర్తిస్థాయిలో పనులు కాలేదు. అలాగే నర్మెటట మండలం గండిరామారం (మల్లన్న గండి) జలాశయం నుంచి తరిగొప్పుల మండలం బొత్తలపర్రె గ్రామం వరకు ఒక లిఫ్టు, గుండ్లసాగర్ నుంచి వేలేరు చెరువుకు రెండో లిఫ్టు, నష్కల్

మిగతా 7వ పేజీలో..

2014 నుంచి దేవాదుల నుంచి ఎత్తిపోతలు (టీఎంసీలు) ఇలా..

సంవత్సరం	ఖరీఫ్	యాసంగి	మొత్తం
2014-15	00	4.981	4.981
2015-16	2.4	5.6	8.00
2016-17	2.38	5.53	7.91
2017-18	2.457	4.563	7.02
2018-19	5.578	10.831	16.41
2019-20	4.008	9.352	13.36
2020-21	4.457	5.447	9.904
2021-22	00	9.138	9.138
2022-23	00	9.406	9.406
2023-24	4.778	9.688	14.466
2024-25	00	00	000



గోదావరి వద్ద దేవాదుల ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్

నాణ్యమైన విద్యను అందించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



టేకుమట్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

టేకుమట్ల, జూలై 31: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మండలంలో ఆయన బుధవారం విస్తృతంగా పర్యటించారు. అంకుషాపూర్ గ్రామ శివారులోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. ఇంటర్ విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. వారికి పలు ప్రశ్నలు వేశారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వెలిశాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సమయ పాలన పాటిస్తూ ప్రజలను నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న వంతెనను పరిశీలించిన కలెక్టర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు అంశాలను సమీక్షించారు. వర్షకాలం దృష్ట్యా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలను విరివిగా నాటి, వాటిని కాపాడుకోవాలన్నారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి సునీత, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, ఎంపీవో సురేష్, ఏపీవో మాధవి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రుణమాఫీ ఫిర్యాదులపై దృష్టి పెట్టాలి

ములుగు కలెక్టర్ దివాకర



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 31: రైతు రుణమాఫీ సహాయ కేంద్రంలో స్వీకరించిన ఫిర్యాదులపై సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. ములుగులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన రైతు రుణమాఫీ సహాయ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న రైతులతో కొద్ద సేపు మాట్లాడారు. రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రుణమాఫీలో పేరు ఉన్న ప్రతి రైతూ బ్యాంకులో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, ఏడీ శ్రీపాల్, ఏవో సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దు

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



ఏటూరునాగారం డిగ్రీ కళాశాలలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, జూలై 31: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహల్లో చదివే విద్యార్థులకు ఇబ్బందుల కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ల్యాబ్‌రూం, తరగతి తరగదులు, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. కళాశాలలో తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపర్చాలని, మరమ్మతు పనులను త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. నాణ్యమైన విద్యతో పాటు వారికి మెరుగైన వసతులు కల్పించాలన్నారు. కళాశాలలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని విద్యార్థినులకు సూచించారు. ఆమె వెంట గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వీరభద్రం తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయాణికురాలి దాడి

బానెట్‌పై కూర్చోవద్దన్నందుకు ఆగ్రహం

ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వివరాలు 7వ పేజీలో

మత్స్యకారుల భారీ ర్యాలీ

చెరువుల వద్ద వేసిన జాలీలు తొలగించొద్దని డిమాండ్

భూపాలపల్లిటౌన్, జూలై 31: చేపల కోసం చెరువుల వద్ద వేసిన కంచెలను (జాలీలు) అధికారులు తొలగించొద్దని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులు భూపాలపల్లిలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు కొనసాగింది. అనంతరం అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య మాట్లాడుతూ జిల్లాలో 118 మత్స్యకార సొసైటీలు ఉన్నాయన్నారు. మండల, గ్రామ కమిటీల ద్వారా చెరువుల్లో ప్రభుత్వం అందజేస్తున్న చేప పిల్లలను వాటిలో వేసి పెంచుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వర్షాకాలంలో వరదలు విపరీతంగా వచ్చి చేపలు బయటకు కొట్టుకుపోవడం వల్ల నష్టం వాటిల్లుతోందని మత్స్యకారులు జాలీలు వేశారన్నారు. అయితే.. చెరువులు తెగడానికి కారణమవుతాయంటూ అధికారులు వాటిని తొలగించేందుకు నిర్ణయించడం దారుణమన్నారు. అలాగైతే మత్స్యకారులకు తీరని నష్టం జరుగుతుందని, సుమారు 7 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. ఇప్పటికైనా చెరువులపైన జాలీలు కట్టడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ చిలుకల పాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల రాజమౌళి, ఉపాధ్యక్షుడు కిష్టస్వామి, మల్లయ్య, మహిళా అధ్యక్షురాలు పుష్పలత, నాయకులు సాంబయ్య, తిరుపతి, దుర్గయ్య, రాములు, ఆనంద్, బాలకృష్ణ, పాల్గొన్నారు.



భూపాలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు, మత్స్యకారులు

దళితబంధు నిధులు విడుదల చేయాలి

సాధన సమితి అధ్యక్షుడు మహేష్



మాట్లాడుతున్న దళితబంధు సాధన సమితి అధ్యక్షుడు మహేష్

ములుగు కలెక్టరేట్, జూలై 31: రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని రాష్ట్ర దళితబంధు సాధన సమితి అధ్యక్షుడు కోగిల మహేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులో బుధవారం ఆయన పర్యటించారు. తెలంగాణ అసెంబ్లీలో ధర్మపురి ఎమ్మెల్యే వడ్లూరి లక్ష్మణ్ దళితులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. రెండో విడత దళితబంధు పథకంలో కేవలం బీఆర్ఎస్ జెండాలు మోసే వారినే ఎంపిక చేశారని అసత్య ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో లబ్ధిదారుల ఎంపిక కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిందని గుర్తుచేశారు. మొదటి విడత దళితబంధు పథకంలో వచ్చిన 100 యూనిట్లను అప్పటి ఎమ్మెల్యే ధనసరి సీతక్క ఎవరికి అందించారో ఇక్కడి దళితులకు తెలుసని అన్నారు. దళితులను రాజకీయ పార్టీలకు ఆపాదించడం మంచిది కాదని, లక్ష్మణ్ ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం ఇలా మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధు నిదులను అంబేద్కర్ అభయహస్తం పథకంలో విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో దళితబంధు సాధన సమితి నాయకులు దాసరి రమేష్, గడ్డం భద్రయ్య, ఊట్ల మోహన్, దినాకర్, చింత రాజు, జనార్దన్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లను పూర్తి చేయాలి

డీఎస్‌వో స్వామి

భూపాలపల్లిటౌన్, జూలై 31: ఇన్‌స్పైర్ నామినేషన్లను పూర్తి చేయాలని జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి అన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఆదేశాల మేరకు భూపాలపల్లిలో బుధవారం నిర్వహించిన రేగొండ, చిట్యాల మండలాల కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. గణిత ఉపాధ్యాయులు ఇన్‌స్పైర్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ ప్రవీణ్, రామ్‌నారాయణ, రాంబాబు, విద్యాసాగర్, హెచ్‌ఎంలు రఘుపతి, కృష్ణకమారి తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతాభినందన సభకు తరలిరావాలి : ఆర్‌యూపీపీ

భూపాలపల్లిటౌన్, జూలై 31: ఈ నెల 2న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే భాషా పండితుల కృతజ్ఞతాభినందన సభకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి వందలాదిగా భాషా పండితులు తరలిరావాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దిల్షాద్, ప్రధాన కార్యదర్శి వేణు కోరారు. భూపాలపల్లిలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యను ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. ఈ క్రమంలోనే భాషా పండితులకు ప్రమోషన్లు వచ్చాయని, బదిలీలు జరిగాయని అన్నారు. కాగా దానికి కృతజ్ఞతాభినందన సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లక్ష్యంపై నిర్లక్ష్యం!

పుంజుకోని బొగ్గు ఉత్పత్తి

నూతన యంత్రాలొచ్చినా ఫలితం శూన్యం

అట్టడుగు స్థానంలో భూపాలపల్లి ఏరియా



భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-6వ గని ముఖ ద్వారం

కాకతీయఖని, జూలై 31: బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి భూపాలపల్లి ఏరియా పురోగతి సాధించడం లేదు. యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. వర్షాకాలాన్ని దృష్టి ఉంచుకుని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టలకు టార్గెట్‌ను తగ్గించినప్పటికీ అనుకున్న స్థాయిలో బొగ్గు ఉత్పత్తిని సాధించలేక పోయారు. అండర్ గ్రౌండ్ గనుల్లో పనిచేసేందుకు నూతన ఎస్‌డీఎల్ యంత్రాలు తీసుకొచ్చినప్పటికీ ఫలితంగా అంతంతమాత్రంగానే ఉంటోందని తెలుస్తోంది. ఓసీల్లో వర్షప్రభావంతో ఉత్పత్తికి అంతరాయం కలుగుతోందని తెలిసినప్పటికీ ముందు జాగ్రత్త చర్యలుగా అండర్ గ్రౌండ్ గనులపై కాస్త దృష్టి సారిస్తే బొగ్గ ఉత్పత్తి అధికంగా వచ్చేదని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు.

సింగరేణి భూపాలపల్లి ఏరియాలో నాలుగు అండర్‌గ్రౌండ్ గనులు, రెండు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటికి జూన్ నెలలో 3,48,700 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించారు. జూలైలో వర్షాలు అధికంగా కురుస్తాయని సింగరేణి అధికారులు ఉత్పత్తి లక్ష్యాన్ని కాస్త తగ్గించి జూలై 30 నాటికి 2,38,173 టన్నుల మాత్రమే టార్గెట్‌ను ఇచ్చింది. గతంలో అండర్ గ్రౌండ్ గనుల్లో ఎస్‌డీఎల్ యంత్రాలు కాలం చెల్లినవి పనిచేస్తుండటంతో బొగ్గు ఉత్పత్తి అంతంత మాత్రంగానే వస్తోందని యాజమాన్యం గుర్తించింది. భూపాలపల్లి ఏరియాకు నూతన ఎస్‌డీఎల్ యంత్రాలను పంపించింది. అయితే వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుని అధిక బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాల్సిన ఏరియా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జూన్ కన్నా జూలైలో 1,10,527 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని తక్కువగా ఇచ్చినప్పటికీ అనుకున్న స్థాయిలో టార్గెట్ రీచ్‌కాకపోవడానికి ఏరియా అధికారుల నిర్లక్ష్యమే కారణమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

గనుల వారీగా బొగ్గు ఉత్పత్తి (జూలై 30 నాటికి)

గని	టార్గెట్	సాధించింది	శాతం
కేటీకే-1	20,192	13,159	65
కేటీకే-5	20,577	16,028	78
కేటీకే-6	14,808	9,985	67
కేటీకే-8	22,981	15,349	67
ఓసీ-2	57,692	53,251	92
ఓసీ-3	1,01,923	41,120	40
మొత్తం	23,81,173	14,88,92	63

చివరి స్థానంలో భూపాలపల్లి

సింగరేణి యాజమాన్యం ఇచ్చిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో భూపాలపల్లి ఏరియా అట్టడుగు స్థానంలో ఉంది. జూన్‌లో 9వ స్థానంలో ఉన్న అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ (ఏపీఏ) జూలై 30 నాటికి 299శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఇల్లందు ఏరియా 133 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి రెండో స్థానంలో నిలిచింది. 115 శాతంతో ఆర్జీ-2 3వ స్థానంలో నిలువగా, మణుగూరు 107 శాతం, ఆర్జీ-3 99శాతం, బెల్లంపల్లి ఏరియా 93 శాతం, కొత్తగూడెం 93 శాతం, ఆర్జీ-1 75 శాతం, మందమర్రి 75శాతం, శ్రీరాంపూర్ 65 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి నాలుగు నుంచి తొమ్మిది స్థానాల్లో ఉన్నాయి. అయితే భూపాలపల్లి ఏరియా 63శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి చివరి స్థానంలో నిలిచింది.

స్టాఫ్‌నర్సు ఉద్యోగాల పేరుతో బురిడీ

- మహిళ నుంచి రూ. 75వేలు వసూలు
- సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు

జనగామ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్‌నర్సు ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసానికి తెరలేపారు. అధికారులు విడుదల చేసిన ఉద్యోగాల నోటిఫికేషన్‌ను ఆసరాగా చేసుకొని ఆమాయకులను మోసం చేస్తున్నారు. ఈనెల 27న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనగామ జిల్లాలో స్టాఫ్‌నర్సు ఉద్యోగాల కోసం డీఎంహెచ్‌వో కార్యాలయం ఈ ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో పలువురు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల కోడ్, ఇతరత్రా కారణాల వల్ల నియామక ప్రక్రియ ఆలస్యమవుతూ వస్తోంది. ఈ క్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సైబర్ నేరగాళ్ల సేకరించారు. ఇందులో భాగంగా ఈనెల 27న జనగామకు చెందిన ఓ మహిళకు ఫోన్ చేశారు. జనగామలో స్టాఫ్ నర్సు ఉద్యోగానికి ఎంపికయ్యారని, ఆర్డర్ కాపీని మెయిల్ చేస్తామని చెప్పారు. ఓ మెయిల్ నుంచి ఆర్డర్ కాపీని పంపి ఖర్చుల కోసం రూ. 75 వేలు చెల్లించాలని షరతు పెట్టారు. ఉద్యోగం వచ్చిందన్న ఆశతో ఆ మహిళ ఆన్‌లైన్ ద్వారా రూ. 75 వేలు చెల్లించింది. తర్వాత జూలై 29న డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంటర్వ్యూ ఉంటుందని, హాజరుకావాలని చెప్పారు. 29న డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఇంటర్వ్యూకు వెళ్లగా తాను మోసపోయానని మహిళ గ్రహించింది. అనంతరం సైబర్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 31: పోలీసుశాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన వారిని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించారు. బుధవారం హనుమకొండలోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన అదనపు డీసీపీ రాగ్యానాయక్, ఇన్‌స్పెక్టర్ దామోదర్, ఎస్సైలు గాలిబ్ షరీఫ్, కుమారస్వామి, ఏఎస్ఐలు సుధాకర్, మక్బూల్, మోహినొద్దిన్, ప్రేమ్‌సాగర్, ముసలయ్య, జైపాల్‌రావు, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ అంజయ్యలను కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీనివాస్, స్వర్ణరాజ్, సతీష్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

వరంగల్ అదనపు డీఎంహెచ్ఓగా డాక్టర్ సాంబశివరావు

▸ హనుమకొండకు అప్పయ్య వచ్చే అవకాశాలు

వరంగల్ మెడికల్, జూలై 31: వరంగల్ జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా ప్రస్తుతం వర్క్‌ఆర్డర్‌పై హనుమకొండ డీఎంహెచ్‌ఓగా కొనసాగుతున్న డాక్టర్ బి.సాంబశివరావు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో కొనసాగిన డాక్టర్ జాటోత్ సుధార్‌సింగ్ హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్‌ఎంవోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్టీ నెంబర్ 415 విడుదల చేసింది. అదే విధంగా ఎంజీఎం ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్‌ఎంవో డాక్టర్ బి.హరీష్‌రాజ్ మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బదిలీ అయ్యారు.

అప్పయ్య..

హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ అప్పయ్య గతంలో పదోన్నతి పొందారు. అయినప్పటికీ వర్క్ ఆర్డర్‌పై ములుగు జిల్లా డీఎంహెచ్‌గానే కొనసాగుతున్నారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్న డాక్టర్ బి.సాంబశివరావు వర్క్ ఆర్డర్‌పై ఇంతకాలం హనుమకొండ డీఎంహెచ్‌వోగా కొనసాగారు. అయితే డాక్టర్ సాంబశివరావు వరంగల్ వైద్య, ఆరోగ్య శాఖకు మారడంతో డాక్టర్ అప్పయ్య హనుమకొండకు వచ్చే అవకాశాలున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే డాక్టర్ అప్పయ్య హనుమకొండకు వచ్చేందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. అదే విధంగా వరంగల్ డీఎంహెచ్‌ఓగా కొనసాగుతున్న డాక్టర్ కె.వెంకటరమణ కరీంనగర్‌లో విధులు నిర్వర్తించాల్సి ఉన్నప్పటికీ వర్క్ ఆర్డర్‌పై వరంగల్‌లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం సాధారణ బదిలీలతో అసలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎవరనే అయోమయం వైద్య వర్గాల్లో కొనసాగుతోంది. ఎంజీఎం ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్‌ఎంవో పోస్టు ప్రస్తుతం ఖాళీగా ఉంది.

భారీగా రిజిస్ట్రార్ల బదిలీలు

▸ ఉమ్మడి జిల్లాలోని 12 మంది సబ్ రిజిస్ట్రార్ల స్థాన చలనం
▸ జిల్లాకు 15 మంది రిజిస్ట్రార్ల రాక
▸ జిల్లా రిజిస్ట్రార్ రవి హైదరాబాద్‌కు బదిలీ



రాంనగర్, జూలై 31: వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. శాఖ డీఐజీ సుభాషిణికి జిల్లా రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జిల్లాల రిజిస్ట్రార్‌లతో పాటు సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు 12మంది సబ్ రిజిస్ట్రార్‌లు పొరుగు జిల్లాలకు బదిలీ అయ్యారు. వరంగల్ జిల్లాకు ఒక జిల్లా రిజిస్ట్రార్ స్థాయి అధికారితో పాటు 14 మంది సబ్ రిజిస్ట్రార్‌లు బదిలీపై వస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి జిల్లా రిజిస్ట్రార్ స్థాయి అధికారి ఫణిందర్ బదిలీపై వరంగల్‌కు వస్తున్నప్పటికీ ఆయనను ఆడిట్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా రిజిస్ట్రార్ రవి హైదరాబాద్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎవరినీ కేటాయించలేదు. డీఐజీ సుభాషిణికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

వరంగల్ నుంచి బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్‌లు

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
డి.సుజాత	వరంగల్ (డీఐజీ కార్యాలయం)	జగిత్యాల
టి.సంపత్‌కుమార్	జనగామ	ఖమ్మం
ఆర్.రాజు	వరంగల్ జిల్లా కార్యాలయం	మధిర
కె.మోసెస్ భాస్కర్	ఆడిట్ వరంగల్	సత్తుపల్లి
వి.వేణుమాధవ్	ఏఆర్‌సీ వరంగల్	కొత్తగూడెం
ఎ.కార్తీక్	ఖిలా వరంగల్	ఖమ్మం
టి.భాగ్యలక్ష్మీ	భీమదేవరపల్లి	ఖమ్మం (ఆడిట్)
ఎస్.రాంకిషోర్	నర్సంపేట	ఖమ్మం
మసియోద్దిన్	వరంగల్ రూరల్	కొల్లూరు
జి.అరుణ	వర్ధన్నపేట	ఖమ్మం రూరల్
ఎ.క్రిష్ణయ్య	చేర్యాల	కామారెడ్డి
అమ్జద్	వరంగల్	స్టేషన్‌ఘన్‌పూర్

వరంగల్‌కు వస్తున్న సబ్ రిజిస్ట్రార్‌లు

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
ఎ.రవీంద్రబాబు	ఖమ్మం	మహబూబాబాద్
జె.రాంనర్సింహరావు	కుసుమంచి (ఖమ్మం)	వరంగల్ జిల్లా కార్యాలయం
జె.కిషన్‌నాయక్	జగిత్యాల	భీమదేవరపల్లి
ఎ.తిరమల్‌రావు	ఐజీ కార్యాలయం	ఆడిట్ వరంగల్
ఆర్.రాము	మంచిర్యాల	భూపాలపల్లి
ఎం.దిలీప్‌చంద్ర గోపాల్	ఐజీ కార్యాలయం	ములుగు
జి.రాంకుమార్	కొత్తగూడెం	వరంగల్ (డీఐజీ కార్యాలయం)
బి.సైదులు	ఇల్లందు	వరంగల్ రూరల్
డి.సుజన్‌కుమార్	ఖమ్మం	పరకాల
పి.యామిని	ఖమ్మం	ఏఆర్‌సీ వరంగల్
ఎ.గిరిధర్	మధిర	నర్సంపేట
జి.నరేంద్ర	ఖమ్మం	ఖిలా వరంగల్
డి.ఆనంద్	కొల్లూరు	వరంగల్ జిల్లా కార్యాలయం
వి.ప్రభాకర్‌రావు	సత్తుపల్లి	వర్ధన్నపేట

మార్కెటింగ్ శాఖలో...

వరంగల్ వ్యవసాయం, జూలై 31: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా మార్కెటింగ్ శాఖలో ఇద్దరు డీఎంవోలకు, ఇద్దరు అకౌంటెంట్లకు, 10మంది గ్రేడ్-2 కార్యదర్శులకు స్థాన చనలం కలిగింది. ఈ మేరకు బుధవారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మిభాయి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల వివరాలిలా ఉన్నాయి.

ఇద్దరు డీఎంవోలు

మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న అనురాధను వరంగల్ డీఎంవో(డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ ఆఫీసర్)గా బదిలీ చేశారు. అలాగే నల్గొండ డీఎంవోగా పనిచేస్తున్న ఎంఏ అలీంను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎంవోగా బదిలీ చేశారు.

ఇద్దరు అకౌంటెంట్లు

ఇద్దరు అకౌంటెంట్లకు స్థాన చలనం కలిగింది. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న జి.సుకన్యను వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీ అయ్యారు. అదేవిధంగా వరంగల్ మార్కెట్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న రాజ్‌కుమార్‌ను గడ్డి అన్నారం మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు.

10 మంది గ్రేడ్-2 కార్యదర్శులు..

ఖమ్మం మార్కెట్ గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న బి.బజరును ఎక్‌నూర్ మార్కెట్‌కు, గడ్డిఅన్నారం మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న సి.వెంకటలక్ష్మిని వలిగొండ మార్కెట్‌కు బదిలీ చేశారు. పరిగి మార్కెట్ కమిటీలో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న ఆర్.సుదర్శన్‌రావును భువనగిరి మార్కెట్‌కు, భువనగిరి మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న డి.అజిత్ రావును వరంగల్ మార్కెట్‌కు, హుజూర్‌నగర్ మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న డి.ప్రభాకర్‌ను హుస్నాబాద్ మార్కెట్‌కు, నిజామాబాద్ మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న విజయ్‌కిషోర్‌ను పరిగి మార్కెట్‌కు, ఏక్‌నూర్ మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్‌రావును నూగూరు(చర్ల) మార్కెట్‌కు, వలిగొండ మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న ఎండి.వహీద్‌ను గడ్డిఅన్నారం మార్కెట్‌కు, హుస్నాబాద్ మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న వి.స్రుజన్‌బాబును ఖమ్మం మార్కెట్‌కు, నూగూరు(చర్ల) మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న ఎంఏ గనీని హుజూర్‌నగర్ మార్కెట్‌కు బదిలీ చేశారు.

బల్దియాలో బదిలీల పర్వం

▸ 4 ఏఈలు 26 మంది పీహెచ్ వర్కర్లకు స్థానచలనం

వరంగల్ కార్పొరేషన్, జూలై 31: గ్రేటర్ వరంగల్ పరిధిలో సాధారణ బదిలీలలో భాగంగా 4 గురు ఏఈలను 26 మంది పీహెచ్ (పబ్లిక్ హెల్త్) వర్కర్లను బదిలీ చేస్తూ బుధవారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈలలో అరవింద, రమ్యకృష్ణ, రోజారాణి, రాజేశ్వరీలను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. అదే విధంగా 4వ తరగతి ఉద్యోగుల విభాగంలో 3 శానిటరీ జవాన్లు, 6 అటెండర్లు, 1 లైన్‌మెన్, 1 వాచ్‌మెన్, 2 పంప్‌ఆపరేటర్లు, 13 మంది పబ్లిక్ హెల్త్ (పీహెచ్) వర్కర్లులకు పరకాల మున్సిపాలిటీకి స్థానచలనం కలిగించారు. వీరిస్థానంలో ఇంకా ఎవరినీ భర్తీ చేయలేదు. అదే విధంగా ఇటీవల బల్దియా నుంచి బదిలీపై వెళుతున్న సీపీ వెంకన్న, అకౌంట్స్ అధికారి వెంకటేశ్వర్లు, ఈఈ బీఎల్ శ్రీనివాస్, డీఈలు సంజయ్, ఇర్షద్ జహన్‌లకు బదిలీ ఆర్డర్లు అందించారు. బుధవారం బదిలీ ఐన సిబ్బంది ఒకటి, రెండు రోజుల్లో రిలీవ్ ఆర్డర్లను తీసుకుని బదిలీ స్థానాల్లో రిపోర్టు చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

ఎంజీఎం హెడ్ నర్సులు..

వరంగల్ మెడికల్, జూలై 31: ఎంజీఎం ఆస్పత్రిలో పని చేస్తున్న హెడ్ నర్సులు బదిలీపై ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. హెడ్ నర్సులు మల్టీజోన్ కావడంతో ఎక్కువ మంది ఆదిలాబాద్ రిమ్స్‌కు బదిలీ అయ్యారు. బుధవారం సాయంత్రం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆదిలాబాద్ నుంచి హెడ్ నర్సులు ఎంజీఎంకు బదిలీపై వచ్చారు. ఇప్పటికే ఎంజీఎంలో ప్రొఫెసర్ల నుంచి మొదలుకొని స్టాఫ్‌నర్సుల వరకు భారీ సంఖ్యలో బదిలీలు జరిగాయి. కాగా, ఆగస్టు ఒకటి నుంచి బదిలీలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబరు 87ను బుధవారం విడుదల చేసింది.

తహసీల్దార్లకు స్థానచలనం

హనుమకొండ కలెక్టరేట్, జూలై31: హనుమకొండ జిల్లాలో పని చేస్తున్న పలువురు తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లాలో పని చేస్తున్న గౌరీశంకర్ బదిలీపై హనుమకొండ కలెక్టర్‌లో తహసీల్దార్‌గా నియామకం అయ్యారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న సురేష్ కమలాపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. హనుమకొండ జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు డిప్యూటీ తహసీల్దార్‌లను, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్‌లను పాలనాదృష్ట్యా బదిలీ చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుల బదిలీ

▸ ఉమ్మడి వరంగల్‌లో దాదాపు 200 స్థాన చలనం

కేయూ క్యాంపస్, జూలై 31: ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా దాదాపు 200 డిగ్రీ కళాశాల అధ్యాపకుల బదిలీ జరిగాయి. ప్రస్తుతం పనిచేస్తున్న కళాశాలల నుంచి బదిలీ పొందిన అధ్యాపకులందరూ బుధవారం రిలీవ్ ఆర్డర్లు పొందారు. అత్యధికంగా హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 51 మంది, పింగళి మహిళ డిగ్రీకళాశాల నుంచి 27 మంది, నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 27 మంది, రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబాబాద్, వర్ధన్నపేట, తొర్రూరు, మర్రిపెడ బంగ్లా, ఏటూరునాగారం, ములుగు, పరకాల, జనగామ, ములుగు ప్రభుత్వ డిగ్రీకళాశాల నుంచి దాదాపు 200 మంది అధ్యాపకులు బదిలీ అయ్యారు. హనుమకొండ నుంచి ఎక్కువ మంది అధ్యాపకులు జమ్మికుంట, సిద్ధి పేట, గజ్వేల్, గోదావరిఖని, తొర్రూరు, మహబూబాబాద్, వర్ధన్నపేట కళాశాలకు బదిలీపై వెళ్లారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని చాలామంది అధ్యాపకులు పింగళి, కేడీసీ, రంగశాయిపేట, నర్సంపేట, పరకాల, ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీపై వచ్చారు. వీరంతా గురువారం కొత్తగా పోస్టింగ్ పొందిన కళాశాలల్లో జా యిన్ కానున్నారు. బదిలీలు పొందిన వారిలో మహబూబాబాద్, మర్రిపెడ బంగ్లా, జనగామ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు కూడా ఉన్నట్లు సమాచారం. ఇటీవల కాంట్రాక్టు అధ్యాపకులుగా ఉండి రెగ్యులరైన అధ్యాపకులకు బదిలీల్లో అవకాశం కల్పించలేదు.

ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయాణికురాలి దాడి

▸ బానెట్‌పై కూర్చోవద్దన్నందుకు ఆగ్రహం
▸ ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



కండక్టర్ కమలాకర్‌రెడ్డిపై దాడిచేస్తున్న మహిళ, ఆమె కుమారుడు

ములుగు, జూలై 31: బానెట్‌పై కూర్చోవద్దన్నందుకు ఆగ్రహించిన ఓ మహిళ తన కుమారుడితో కలిసి ఆర్టీసీ కండక్టర్‌పై దాడిచేసింది. ములుగు జిల్లా మల్లంపల్లి వద్ద బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. కండక్టర్ సి.హెచ్.కమలా కర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్-2 డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు (టీజీ03టీ 0459) హైదరాబాద్ నుంచి ఏటూరునాగారం వెళ్తున్న క్ర మంలో హనుమకొండ జిల్లా ఆత్మకూరులో ఓ మహి ళ ఎక్కింది. బస్సులో సుమారు 70మంది ప్రయాణి కులు ఉండగా, సీట్లు లేకపోవడంతో డ్రైవర్ పక్కన ఉన్న బానెట్‌పై కూర్చుంది. అక్కడ కూర్చోవడం ప్రమాదకరమని, బస్సులోపలికి వెళ్లాలని డ్రైవర్ కా ర్తీక్, కండక్టర్ సీహెచ్.కమలాకర్ సదరు మహిళకు సూచించారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆమె కండక్ట ర్‌ను దుర్భాషలాడింది. దీంతో బస్సును నిలిపిన డ్రైవర్, కండక్టర్ ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫి ర్యాదు చేశారు. ఆ మహిళను అక్కడే దించి బయ ల్దేరారు. అయితే తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై బస్సును వెంబడించి ములుగు మండలం మల్లంపల్లి వద్ద ఆపారు. ఆ మహిళ కండక్టర్‌పై చెప్పులేపగా వెంట వచ్చిన ఆమె కుమారుడు చేయి చేసుకున్నాడు. ఈ దాడి దృశ్యాలను డ్రైవర్ తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేశారు. అనంతరం ములుగుకు వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్టీసీ కండక్టర్‌పై దాడిచేసిన ఘటనలో ప్రయాణికురాలు సుక్క లలిత, ఆమె కుమారుడు దినేష్‌పై ములుగు పోలీసులు కేసు నమోదు చేశారు. కండక్టర్ కమలాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై-2 రామకృష్ణ తెలిపారు. కండక్టర్‌పై దాడిచేసిన మహిళ స్వగ్రామం ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురమని తెలుస్తోంది.



బస్సు కండక్టర్ కమలాకర్

ఎత్తిపోతలు ఎలా?!

5వ పేజీ తరువాయి

నుంచి వంగాలపల్లి, మల్లక్కపల్లి, ధర్మారం వరకు మూడో లిఫ్టు పనులు పూర్తి చేయాల్సి ఉంది. వీటితో ఇంకా 3వేల ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉంది. పైవీటన్నింటికీ మరో రూ.3,588కోట్ల నిధులు అవసరంగా అధికారులు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటంతో ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో దేవాదుల ఎత్తిపోతలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బడ్జెట్‌లో ప్రాధాన్యత ఏదీ?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలకమైన ప్రాజెక్టుల్లో దేవాదుల మొదటిది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 5లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. అయితే 20ఏళ్లుగా ఏ ప్రభుత్వం కూడా ఆశించిన స్థాయిలో నిధులు కేటాయింపులు ఉండటం లేదు. దీంతో దేవాదుల ప్రాజెక్టు అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే రూ.13,911.88కోట్ల నిధులను ఖర్చు చేయగా, 2023లో ప్రాజెక్టు అంచనా బడ్జెట్‌ను రూ.17వేల కోట్లకు పెంచారు. కాగా, ఇంజనీర్లు పంపించిన నివేదికపై ఇటీవల భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో సమీక్ష నిర్వహించారు. నగర ప్రాంతంలో భూసేకరణతో పాటు మరికొన్ని పనులను మినహాయించి రూ.625కోట్లతో దేవాదుల మూడోదశ నీటిని ఎత్తిపోసేలా ప్రణాళిక రూపొందించారు. రూ.1,000కోట్ల లోపు బడ్జెట్‌తో పూర్తి అయ్యే ప్రాజెక్టులను గుర్తించి 2025 మార్చిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని భావించినప్పటికీ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులే లేకపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. కేవలం రూ.78.04కోట్లు దేవాదుల ప్రాజెక్టు నిర్వహణ, ఇతర ఖర్చుల కోసం కేటాయింపులు చేసింది. అలాగే సమ్మక్క బ్యారేజీ కోసం రూ.30.05కోట్లు మంజూరు చేసింది. దీంతో దేవాదుల పనులకు ఈ ఏడాది కూడా నిధుల కొరత తప్పదనే చర్చ జరుగుతోంది. ఫలితంగా మూడో దశ దేవాదుల పనులు పూర్తి అయినప్పటికీ 6లక్షల ఎకరాలకు సాగునీరు అందించటం సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఒక్క ప్రాజెక్టుకు కూడా ప్రాధాన్యత ఇవ్వకపోవటంపై ఓరుగల్లు నేతల తీరుపై రైతుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. పొరుగున ఉన్న ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు భారీగా ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు జరిగితే, ఉమ్మడి వరంగల్‌కు మాత్రం సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కొరత ఉండటంపై ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఆధునిక సాగు పద్ధతులతో రైతులకు మేలు

వరంగల్ చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ● మార్కెట్‌లో వ్యవసాయ పరికరాల ప్రదర్శన



సబ్సిడీపై పవర్ టిల్లర్ కొనుగోలు చేసిన రైతుకు బిల్లు అందిస్తున్న రవిందర్‌రెడ్డి, నిర్మల

వరంగల్ వ్యవసాయం, జూలై 31: వ్యవసాయ రంగంలో మ్యాన్ పవర్ తగ్గిన నేపథ్యంలో ఆధునిక సాగు పద్ధతుల ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశాలున్నాయని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని మన అగ్రిటెక్‌లో లబ్ధి అర్జున్ సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాల ప్రదర్శన, రైతులకు సబ్సిడీపై విక్రయించగా, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. రవీందర్‌రెడ్డి, నిర్మలకు మన అగ్రిటెక్ సంస్థ నిర్వాహకుడు రమేష్ వ్యవసాయ సాగు విధానంలో ఆధునిక పరికరాల గురించి వివరించగా వాటిని పరిశీలించి రైతులకు మంచిగా పనికి వస్తాయని సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి, నిర్మల మాట్లాడుతూ.. వ్యవసాయం పట్ల ఆసక్తి తగ్గుతున్న యువతతో సాగు చేయించేందుకు కంపెనీలు ఆధునిక పరికరాలను రూపొందిస్తున్నాయన్నారు. పది మంది చేయాల్సిన పనిని ఒక యంత్రం గంటలో చేసే విధంగా రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏనుమాముల సీఐ పులి రమేష్, గ్రేడ్-2 కార్యదర్శి రామోజు రాము, మార్కెట్ అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బంజారా బాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి

▸ సంత్ సేవాలాల్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పె ఏర్పాటు చేయాలి
▸ మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ డిమాండ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీతారాం నాయక్

హనుమకొండ, జులై 31, (ఆంధ్రజ్యోతి): బంజారా లంబాడీల భాషను రాజ్యంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రశాంత్ నగర్‌లోని తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో 12కోట్ల మంది బంజారాలు మాట్లాడే భాషకు తగిన గుర్తింపు లేదని విచారం వ్యక్తం చేశారు. భాషకు లిపి లేకబంజారాలు చరిత్రలో వెనుబడి పోయారని, వారి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు గ్రంథస్థం కాలేక క్రమంగా కనుమరగయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. బంజారాల భాషకు లిపి లేకపోవడం వల్లనే బంజారాల విశిష్టత ప్రపంచానికి తెలియకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. మిగతా ప్రజల్లాగా కాకుండా బంజారాలు ఎక్కడ ఉన్నా ఒకే భాషను ఒకే రీతిన మాట్లాడుతారన్నారు. తక్కువ జనాభా వున్న ఇతర ప్రజల భాషకు తగిన గుర్తింపు ఉండీ.. బంజారా భాషకు లేకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా బంజారాల భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా తగిన గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు. బంజార లంబాడీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన తీజ్ పండుగ ప్రాముఖ్యత కోల్పోయే పరిస్థితి ఉందని ప్రొఫెసర్ సీతారాం విచారం వ్యక్తం చేశారు. ఆర్థికభారం, అవగాహనలోపంతో తీజ్ పండుగ జరుపుకోలేని తండాలు ఎన్నో ఉన్నాయన్నారు. బంజారాల ఏకైన తీజ్ పండుగను కాంగ్రెస్ ప్రభుత్వమైనా గుర్తించి, తగిన ప్రాధాన్యత ఇచ్చి కాపాడాలని కోరారు.

తీజ్‌ను ట్యాంక్ బండ్‌లో నిమజ్జనానికి ప్రభుత్వం అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బంజరాల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని గత ప్రభుత్వంలో తాను మా ట్లాడినందుకు రాజకీయంగా తనను భ్రష్టుపట్టించారని, గిరిజన హక్కుల గురించి ప్రశ్నించినందుకు తొక్కిపెట్టారన్నారు. బంజారాల ఆరాధ్యదైవమైన సంత్‌సేవాలాల్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అంతేకాకుండా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహించాలన్నారు. తీజ్ నిమజ్జనం, బాషను 8వ షె డ్యూల్‌లో ఉంచడం, సంత్‌సేవాల్ విగ్రహం ట్యాంక్ బండ్‌పై పెట్టడపై అసెంబ్లీలో ఏకవ్యాక్య తీర్మానం చేయాలని సీతారాం నాయక్ డిమాండ్ చేశారు.

చెరువుకు మరమ్మతులెప్పుడో..?

1,563 ఎకరాల సాగుకు ఆటంకం

వెంకటాపూర్(రామప్ప), జూలై 31: మండలంలోని మారేడు గొండ చెరువు మరమ్మతులను ప్రభుత్వం విస్మరించింది. 1,563 ఎకరాలకు సాగునీరు అందించే ఈ చెరువు కట్ట గత సంవత్సరం సెప్టెంబరు 23న అర్ధరాత్రి తెగిపోయింది. నీరంతా సమీప గ్రామాల్లోకి ప్రవేశించి ఇద్దరు గల్లంతయ్యారు. అప్పటి నుంచి చెరువుకు మరమ్మతులు చేయాలన్న విషయాన్ని ప్రభుత్వం మరచిపోయింది. చెరువు మరమ్మతు పనులకు అధికారులు తొలుత రూ.7కోట్ల13 లక్షలకు అంచనా వ్యయంతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఆ తర్వాత 2023 డిసెంబరులో రెండోసారి రూ.4కోట్ల32లక్షలతో అంచనా వేసి ప్రభుత్వానికి తిరిగి నివేదిక సమర్పించారు. అప్పటి నుంచి ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో చెరువు మరమ్మతులకు నోచుకోవడం లేదు.



కొట్టుకుపోయిన చెరువు కట్ట

నీరు లేక రైతుల విలవిల

ఈ చెరువు ఆయకట్టు కింద 1563 ఎకరాలు సాగవుతున్నాయి. మారేడుగొండ చెరువు కింద 543 ఎకరాలు, నాన్‌లోకల్ కింద 400 ఎకరాలు, పెద్ద మాటు కింద 250 ఎకరాలు, చిన్నమాటు కింద 230 ఎకరాలు, తెన్సులకుంట కింద 140 ఎకరాలు సాగవుతున్నాయి. చెరువు తెగి పది నెలలు గడుస్తున్నప్పటికీ మూడు పంటలను రైతులు కోల్పోయారు. ఈసంవత్సరమైనా చెరువుకు మరమ్మతులు చేపట్టకపోతే మరోపంట కూడా కోల్పోవాల్సి వస్తుందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



ధ్వంసమైన మత్తడి

మంత్రి జోక్యం చేసుకోవాలని రైతుల విన్నపం

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క మారేడుగొండ చెరువు మరమ్మతులపై దృష్టి పెట్టాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరమ్మతులకు కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కనీసం నాలుగో పంట నష్టపోకుండా తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ప్రమాదకరంగా ప్రధాన రహదారి

మల్హర్, జూలై 31 : మండల కేంద్రమైన తాడిచర్ల నుంచి నాగులమ్మ వరకు ఉన్న డబుల్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. మల్లారం ఆరెవాగు నుంచి ఫారెస్టు నర్సరీ వరకు పూర్తిగా గుంతలమయమైంది. దీంతో నాలుగు కిలో మీటర్ల మేర ప్రయాణం ఇబ్బందిగా మారింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. ఎనిమిదేళ్ల క్రితం రూ. 15 కోట్లతో నాగులమ్మ వద్ద నుంచి తాడిచర్ల వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రెండేళ్ల క్రితం రూ. కోటితో మరమ్మతులు చేపట్టినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. నిత్యం ఈ రోడ్డు పై నుంచి మొన్నటి వరకు ఇసుక, నిరంతరం బొగ్గు లారీలు నడవడం వల్ల రోడ్డు పలు చోట్ల పూర్తిగా ధ్వంసమైంది. మల్లారం ఆరెవాగుపై ఉన్న బ్రిడ్జి కూడా పూర్తిగా దెబ్బతింది. దీంతో వర్షం పడినప్పుడు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ విషయంపై ఆర్అండ్‌బీ అధికారులను వివరణ కోరగా రూ. 35 కోట్లతో నాగులమ్మ వద్ద నుంచి తాడిచర్ల వరకు డబుల్ రోడ్డు పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ మార్గంలోని గ్రామాల్లో నాలుగు వరసల రోడ్డు మాదిరిగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే తాడిచర్ల నుంచి ఖమ్మంపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 8 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.



గుంతలమయంగా నాగులమ్మ-తాడిచర్ల ప్రధాన రహదారి

● ఇదేంది.. ఇట్లున్నది..?!



ఈ బిల్డింగ్‌ను చూస్తే ఏమనిపిస్తోంది? హర్రర్ సినిమాలో భూత్ బంగ్లాలా ఉంది కదూ..! ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల నడుమ పాడుపడ్డ ఈ భవనంలో మనుషులు ఎవరూ ఉండరని అనుకుంటారు ఎవరైనా. దగ్గరికి వెళ్లడానికి కూడా జంకుతారు. అయితే.. ఇది చూడ్డానికి భూత్ బంగ్లాలా ఉన్నా ఇందులో ఎంచక్కా ఓ ఆఫీసు నడుస్తోంది. ఇదెక్కడో కాదు.. భూపాలపల్లి పట్టణ నడిబొడ్డున తహసీల్దార్ కార్యాలయం పక్కనే. ఇందులో కొన్నేళ్లుగా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. దగ్గరికి వచ్చి చూస్తే తప్ప అది ఆఫీసు అనే విషయం ఎవరికీ అర్థం కాదు. నిత్యం ఇక్కడికి వచ్చే రైతులు దీన్ని చూసి విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 'అగో.. ఇదేంది.. ఆఫీసులు ఇట్ల సుత ఉంటయా?' అని ముక్కున వేలు వేసుకుంటున్నారు.

- కృష్ణకాలనీ (భూపాలపల్లి)

టీజీటీడబ్ల్యూఆర్‌జేసీలో ప్రవేశాలు

వాజేడు, జూలై 30: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల (టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ)లో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్రమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 37 సీట్లు, బైపీసీలో 26 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఐదో తరగతిలో 10 సీట్లు, ఆరో తరగతిలో ఐదు సీట్లు, ఏడో తరగతిలో 31 సీట్లు ఉన్నాయని వివరించారు. ఎస్టీ బాలికలకు మాత్రమే స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9959125277 ంబరును సంప్రదించాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మల్హర్, జూలై 31 : మండలంలోని మల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేకాధికారి అవినాష్ బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను కూడా అవినాష్ పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి రాజు, ప్రధానోపాధ్యాయులు, జీపీ సిబ్బంది ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక ప్రయోజనాలు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

రేగొండ, జూలై 31: ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పాం సాగుతో అధిక ప్రయోజనలు ఉంటాయని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మండలంలోని కొత్తపల్లి(బీ) గ్రామంలో లెంకల ఆదిత్యకుమార్ అనే రైతు క్షేత్రంలో ఆయిల్‌పాం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ రాహుల్‌శర్మ హాజరయ్యారు. ప్రభుత్వం ఈ పంట సాగు చేయడానికి రాయితీలు ఇస్తోందన్నారు. ఆయిల్‌పాం సాగుతో ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. అదేవిధంగా అంతర పంటలు కూడా సాగు చేసి అధిక లాభాలు పొందొచ్చన్నారు. ఉద్యాన శాఖ ద్వారా రాయితీలో డ్రిప్ కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే శ్రావణ మాసంలో జిల్లాలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి సంజీవరావు, సువేన్ ఆగ్రో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ గండ్ర గౌతంరెడ్డి, తహసీల్దార్ శ్వేత, మండల ప్రత్యేక అధికారి శామ్యూల్, ఏవో వాసుదేవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రేగొండ తహసీల్దార్‌గా శ్వేతారావు

రేగొండ, జూలై 31: రేగొండ తహసీల్దార్‌గా కె.శ్వేతారావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాటాడుతూ ప్రజలు దళారులను ఆశ్రయించకుండా నేరుగా తనను కలవాలని సూచించారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రజాక్, సీనియర్ అసిస్టెంట్ స్పందన, ఆర్ఐ నరేష్ శుభాకాంక్షలు తెలిపారు.

తల్లిపాల వారోత్సవాలపై అవగాహన

మహదేవపూర్, జూలై 31 : మహదేవపూర్ ప్రాజెక్టు పరిధిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించడానికి బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీడీపీవో రాధిక హాజరై మాట్లాడారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలన్నారు. తల్లి పాల వారోత్సవాలు నిర్వహించడానికి జరిగే అంతరాలను అధిగమించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో ప్రసవించే మహిళలకు సహకరించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతల విషయంలో అంగన్‌వాడీలు జాగ్రత్తలు వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీపీవో వెంట సూపర్‌వైజర్ ఎం.నాగరాణి, సోషల్ అభియాన్ బీసీ బి. ప్రసన్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తాడిచర్లలో సివిల్ రైట్స్ డే

మల్హర్, జూలై 31: మండల కేంద్రమైన తాడిచర్లలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామ స్థులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో తహసీల్దార్ రవి, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఏఎస్సై హరికృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

వాజేడు, జూలై 31: మండలంలోని మురుమూరు జీపీలో బుధవారం ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. ఇటీవల వచ్చిన వర్షాలకు గ్రామాల్లో బురద, చెత్తా చెదారం పేరుకుపోవడంతో జీపీ సిబ్బంది తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఘనపురం, అరుణాచలపురం, ప్రగళ్లపల్లి, మురుమూరులోని పాఠశాలలో సైతం పారిశుధ్య పనులను నిర్వహించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మంగపేట, జూలై, 31: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఏటూరు నాగారం సీఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. మంగపేటలోని ఎక్కటి సరోజని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ పై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల (డ్రగ్స్)కు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం విద్యార్థులకు ఇదే అం శంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

గణపురంలో..

గణపురం: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఎస్సై అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బాలసదనం విద్యార్థినులకు ఇబ్బంది రావొద్దు

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు, జూలై 31: ములుగు జిల్లాకేంద్రంలోని బాలసదనం విద్యార్థినులకు ఇబ్బంది పడకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ .దివాకర సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినతో కలిసి బాలసదనంను ఆయన బుధవారం సందర్శించారు. వసతులు, సౌకర్యాలు, తరగతిగదులు, పలు రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకో వాలని అన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారు చక్కగా చదువుకునేలా ప్రోత్సహించా లన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ సుమతి, డీసీపీయూ బాలల పరిరక్షణ అధికారి కృష్ణవేణి, బాలసదనం చైల్డ్‌వెల్ఫేర్ ఆఫీసర్ సంధ్య, కౌన్సిలర్ రాణి తదితరులు ఉన్నారు.

గిరిజన బాలికల హాస్టల్ తనిఖీ

ములుగులోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ దివాకర బుధవారం రాత్రి 8గంటల సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతులు, భోజన సదుపాయంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు ఎస్సీ, బీసీ, మైనారిటీ, కేజీబీవీ, గురుకులాలు, హాస్టళ్ల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు స్నానానికి వేడినీటిని అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్రీజతో ఉన్నారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు : సీపీఎం

మంగపేట, జూలై 31: మండలంలోని బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై ఇసుక లారీలను నిలిపివేసి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం ములుగు డివిజన్ కమిటీ సభ్యుడు జాగటి చిన్నా డిమాండ్ చేశారు. మండలంలోని చుంచుపల్లి, వాడగూడెం, పాలాయిగూడెం ఇసుక క్వారీల ప్రాంతాలను ఆయనతోపాటు ఆ పార్టీ నేతలు బుధవారం పరిశీలించారు. అనంతరం మంగపేటలో చిన్నా విలేకర్లతో మాట్లాడారు. కాంట్రాక్టర్లు ప్రధాన రహదారికి ఇరువైపులా విచ్చలవిడిగా ఇసుక కుప్పలను పోసి రోడ్లపైనే లారీలను నిలిపివేసి లోడ్ చేస్తూ ఇతర వాహనాలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 108 అంబులెన్స్ వస్తున్నా లారీలను తప్పించడం లేదని, దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయన వెంట సీపీఎం డివిజన్ నాయకులు ఎల్పీ. ముత్యాలు, ఎన్.ఎస్.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వైద్య శిబిరాలు

వాజేడు, జూలై 31: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో మండలంలో ముమ్మ రంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. వాజేడు, పేరూరు పీహెచ్‌సీల పరిధిలోని గుడిసెల పోరాట కేంద్రం, దుబ్బగుడెంలో బుధవారం వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులను అందజేశారు. డెంగీ, మలేరియా లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యశాలలకు వచ్చి వైద్యం పొందాలని సూచిం చారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రాకుండా ఉంటాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. వైద్యాధికారులు రాహీల్, మహేందర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అచీవ్‌మెంట్ సర్వేలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎమ్మార్పీలతో ములుగు డీఈవో పాణిని

ములుగు కలెక్టరేట్, జూలై 31: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో ఉత్తమ ఫలితాలు సాధించాలనివిద్యాశాఖ అధికారి పాణిని ఎమ్మార్పీలకు సూచిం చారు. ములుగులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో ఉన్నత స్థానానికి చేరుకునేలా మండలస్థాయిలో ఎమ్మార్పీలు శిక్షణ తీసుకుని వెళ్లాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులకు, తద్వారా క్షేత్రస్థాయిలో విద్యార్థులకు చేరేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు కృష్ణ, శ్రీకాంత్, సముద్రాల శ్రీనివాసచారి, హమీద్, సతీష్ కుమార్, ఆగయ్య, మధుసూదన్, రాయప్ప, కందాల రామయ్య, కాంప్లెక్స్ పర్సన్లు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ

ములుగు కలెక్టరేట్, జూలై 31: ములుగు పోలీసుల ఆధ్వర్యంలో త్వరలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నామని, ఆసక్తి ఉన్న యువత ఆగస్టు 8లోగా ములుగు పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎస్సై వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతితోపాటు జిల్లాస్థాయి మెగా టోర్నీకి అవకాశం కల్పించడం జరుగుతుందని, పూర్తి వివరాలకు 8712670082, 8712670081 సెల్ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

చెరువు పనుల్లో నాణ్యతా లోపం!

మొగుళ్లపల్లి, జూలై 31: గత సంవత్సరం విస్తారంగా కురిసిన భారీ వర్షాల వల్ల తెగిపోయిన చెరువు కట్ట మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించిం దని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసి టెండర్ నిర్వహించగా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపటాడని అంటున్నారు. మండలంలోని పెద్దకోమ టిపల్లి గ్రామ శివారు పెద్దచెరువు గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు కట్ట పూర్తిగా ధ్వంసమైంది. దీంతో సమీపంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రూ.20 లక్షలను మంజూరు చేయగా కాంట్రాక్టర్ నాణ్యతలేని పనులు చేపట్టడంతో కట్ట ఆదిలోనే కుంగి, కూలిపోయే పరిస్థితికి వచ్చిందని గ్రామస్థులు తెలిపారు. పనులను దగ్గరుండి చేయించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పెద్దకోమటిపల్లి చెరువు కట్ట మరమ్మతు పనులను కాంట్రాక్టర్‌చే నాణ్యతాయుతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఓసీ ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తి పునఃప్రారంభం

కాకతీయఖని, జూలై 31: పది రోజుల అనంతరం సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి బుధవారం పునఃప్రారంభమైంది. అయితే వర్షాలు తగ్గడంతో తిరిగి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తిని చేపడుతున్నట్లు ఏరియా సింగరేణి అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు

గోవిందరావుపేట, జూలై 31: మండలంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పస్రా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ పోలీస్ సిబ్బందితో కలిసి సోమలగడ్డ క్రాస్ డివైడర్ వద్ద ట్రాక్టర్ టైరుకు రేడియం స్టిక్కర్లు అంటించి ఏర్పాటు చేశారు. సోమలగడ్డ క్రాస్ రోడ్డు వద్ద తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణనష్ట సంభవించిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. క్రాస్ వద్ద రాత్రిపూట ఎలాంటి లైటు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ఈ ఏర్పాట్లు చేశామని అన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గడానికి ఆస్కారం ఉందని అన్నారు. వారివెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి స్వచ్ఛంద మరమ్మతులు

ఏటూరునాగారం, జూలై 31 : మండల పరిధి ఎక్కెల గ్రామంలోని అంగన్‌వాడీ భవనం పూర్తి శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. మనం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ టీచర్ చౌలం శ్రీనివాస్ తన సొంత ఖర్చుతో స్వచ్ఛందంగా భవనానికి మరమ్మత్తులు చేపట్టారు. నూతనంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించారు. శ్రీనివాస్ కృషిని గ్రామస్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

కుప్పకూలిన ఇంటి గోడ

కాటారం, జూలై 31: మండలంలోని రేగులగూడెం జీపీ పరిధిలోని గోపాల్‌పూర్‌లో సెగ్గం రవీందర్‌కు చెందిన ఇంటి గోడ మంగళవారం రాత్రి కుప్పకూలింది. రాత్రి వర్షం కురిసిన సమయంలో సిమెంట్ ఇటుకలతో కట్టిన గోడ బయటివైపు కుప్ప కూలినట్లు రవీందర్ తెలిపారు. ఆ గది లోపలే రవీందర్ కుటుంబం నిద్రించినప్పటికీ గోడ బయటి వైపు పడటంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం పరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

తెలంగాణ మ్యాథ్స్ ఫోరం కార్యవర్గం ఎన్నిక

కాటారం, జూలై 31: మండల కేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం సబ్ డివిజన్ స్థాయి తెలంగాణ మ్యాథ్స్ ఫోరం కమిటీల ఎన్నిక జరిగింది. టీఎంఎఫ్ జిల్లా నేత, ములుగుపల్లి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయులు సమావేశమై కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల కమిటీలను ఎన్నుకున్నారు. కాటారం మండల అధ్యక్షుడిగా గంట రాజబాపు, ప్రధాన కార్యదర్శిగా బి.కవిత, కోశాధికారిగా రవీందర్, మహాముత్తారం మండల అధ్యక్షుడిగా కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా డి. రాము, కోశాధికారిగా రవీంద్రనాథ్, మహదేవపూర్ మండల అధ్యక్షుడిగా పి.సుధారాణి, ప్రధాన కార్యదర్శిగా కె.సారంగపాణి, కోశాధికారిగా జె.రవీందర్, మల్హర్ మండల అధ్యక్షుడిగా రఘుకుమార్, ప్రధాన కార్యదర్శిగా జగన్‌నాయక్, కోశాధికారిగా ఎన్.శ్రీధర్‌రెడ్డి, పలిమెల మండల కన్వీనర్‌గా కె.లత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు పవన్‌కుమార్, శ్రీధర్, రాజేంద్రప్రసాద్, సునీత తదితరులు పాల్గొన్నారు.

కాటారం రేంజ్ అధికారిగా ఆసిఫ్ అలీ

కాటారం, జూలై 31: అటవీ శాఖ కాటారం రేంజ్ అధికారిగా మహ్మద్ ఆసిఫ్ అలీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా భూపాలపల్లి డివిజన్ దూదేకులపల్లి రేంజర్‌గా ఉన్న ఆసిఫ్ ఆలీని కాటారం రేంజర్‌గా బదిలీ చేశారు. ఇటీవల వరకు ఇక్కు ఇన్‌చార్జి రేంజర్‌గా కొయ్యూరు రేంజర్ కిరణ్‌కుమార్ విధులు నిర్వర్తించారు. బాధ్యతలు స్వీకరించిన ఆసిఫ్ అలీని రేంజ్ పరిధిలోని అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

చెల్పూరు రేంజర్ బదిలీ

గణపురం: చెల్పూరు రేంజ్ అటవిశాఖ అధికారి నాగరాజు పలిమెలకు బదిలీ అయ్యారు. నాలుగేళ్లుగా చెల్పూరు రేంజ్ పరిధిలో విశేష సేవలందించినందుకు గాను అటవిశాఖ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.

రేవంత్‌రెడ్డి, సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం

మంగపేట, జూలై 31: రెండో విడుత రుణమాఫీపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి సీతక్క చిత్రపటాలకు బుధ వారం క్షీరాభిషేకం చేశారు. మండ లంలోని అకినేపల్లి-మల్లారం, టీకొత్త గూడెంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి, కాంగ్రెస్ నా యకులు ఎస్.నాగిరెడ్డి, పి. దామో దర్‌రెడ్డి, షేక్ మదార్ హుస్సేన్, పి.హేమంత్‌రెడ్డి, ధూలిపాల బాలకృష్ణ, షేక్ మొయినొద్దీన్, తొండపు సంజీవరెడ్డి, కటుకూరి శేషయ్య, పొడుతూరి వరదయ్య, గిద్ద వరుణ్, దినసరపు రమణారెడ్డి, చెట్టుపెల్లి గంగరాజు, ఎన్. వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

రుణమాఫీతో 2,209 మంది రైతులకు లబ్ధి

మల్హర్, జూలై 31 : రెండు విడతల చేపట్టిన రైతు రుణమాఫీతో మండల వ్యాప్తంగా 2,209 మంది రైతులకు లబ్ధి చేకూరింది. మొదటి విడతలో 1,473 మంది లబ్ధిపొందారు. కొయ్యూర్ క్లస్టర్‌లో 330, పెద్దతూండ్ల 412, తాడిచర్ల 396, రుద్రారం క్లస్టర్‌లో 335 మంది రైతుల రుణాలు మాఫీ అయ్యింది. రెండో విడతో 736 మంది కొయ్యూర్ క్లస్టర్‌లో 153, పెద్దతూండ్ల 204, రుద్రారం 188, తాడిచర్ల క్లస్టర్‌లో 191 మంది రైతుల రుణాలు మాఫీ అయినట్లు ఏవో సుధాకర్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయులకు వీడ్కోలు సభలు

మహదేవపూర్, జూలై 31: కాళేశ్వరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామగుండం రామ్మూర్తి ఉద్యోగ విరమణ పొందగా మహదేవపూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన్ను బోధన, బోధనేతర సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.అన్నపూర్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో రామ్మూర్తి అంకితభావాన్ని కనబర్చి ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. రామ్మూర్తి 1985లో ఉద్యోగంలో చేరారని, నాలుగేళ్ల షాద్‌నగర్‌లో పనిచేసి అంతర్ జిల్లా బదిలీపై కరీంనగర్ జిల్లా కాటారం మండలం మద్దులపల్లి గ్రామంలో (1989-91) రెండు సంవత్సరాలు పనిచేశారని అన్నారు. అనంతరం కాళేశ్వరం యూపీఎస్‌లో 1992లో చేరి 12 సంవత్సరాలు సేవలందించరాన్నారు. 2011 నుంచి ఇప్పటి వరకు కాళేశ్వరం ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించారన్నారు. జిల్లా స్థాయిలో రెండు సార్లు ఉత్తమ ప్రధానోపాధ్యాయుడి పురస్కారం అందుకునానరని పేర్కొన్నారు.

జూకల్ పాఠశాల హెచ్‌ఎంకు..

చిట్యాల: మండలంలోని జూకల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎర్రం జగదీశ్వర్లు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆ పాఠశాలలో వీడ్కోలు సభ జరిగింది. ఈ కార్యక్రమానికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 37 సంవత్సరాలు మారుమూల ప్రాంతాల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు జగదీశ్వర్లు కృషి చేశారని కొనియాడారు. ఆయన సర్వీస్‌లో చాలా నిబద్ధతో పని చేశా రన్నారు. అనంతరం జగదీశ్వర్లు దంపతులకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, డీసీఈడీ సెక్రటరీ చంద్రశేఖర్, అసిస్టెంట్ సెక్రటరీ శనిగరపు భద్రయ్య, ప్రధానోపాధ్యాయురాలు సునీత, నోడల్ ఆఫీసర్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.